# 4

# యేసు ఎప్పుడు, ఎక్కడ, ఎలా జీవించాడు?

"ఒకానొక సమయంలో యేసు అనే పేరున్న వ్యక్తి ఉండేవాడు" అంటూ యేసు చరిత్రను సువార్తలు ప్రారంభించలేదు. చాలామంది ఆయనను గూర్చి ఆ విధంగా ఆలోచిస్తారు. కాని ఆయన ఒక కాలంలో జీవించిన వాస్తవమైన వ్యక్తిగా ఆలోచించరెందుకో; సువార్త చెప్పే తీరు వేరుగావున్నది. యిక్కడ లూకా యేసు జీవితం, సేవను చారిత్రాత్మకంగా వివరిస్తూ మనలనెలా ఒప్పింపజేస్తున్నాడో చూడండి:

> తిబెరికైసరు ఏలుబడిలో పదునైదవ సంవత్సరమందు యూదయకు పొంతిపిలాతు అధిపతిగాను, గలిలయకు హేరోదు చతుర్థాధిపతిగాను, ఇతూరయ త్రకోనీతి దేశములకు అతని తమ్ముడైన ఫిలిప్పు చతుర్థాధిపతిగాను, అబిలేనే దేశమునకు లుసానియ అధిపతిగాను, అన్నయు, కయపయు ప్రధానయాజకులుగాను, ఉన్న కాలమున అరణ్యములోనున్న జెకర్యా కుమారుడైన యోహాను నొద్దకు దేవుని వాక్యము వచ్చెను (లూకా 3:1, 2).

లూకా తన రచనల్లో రోమా చక్రవర్తి, యూదయ గవర్నర్ పాలస్తీనాలోని ఆయన పరిగణాల పరిపాలకులను మరియు యోహాను, యేసువారి బహిరంగ పరిచర్య ప్రారంభించిన సమయంలో యూదుల్లోని ప్రధానయాజకులు, వీరందరి పేర్లను ప్రస్తావించినాడు. అదేవిధంగా మత్తయి కూడ వ్రాస్తూ యేసు యూదయ దేశపు బేత్లెహేములో "హేరోదు రాజు పరిపాలించిన దినాల్లో" జన్మించాడు (మత్తయి 2:1) అని వ్రాశాడు. యిక్కడ లూకా, మత్తయి పేర్కొన్న నాయకులు, పరిపాలకులు ఆనాటి చరిత్రకారులకు క్రొత్త నిబంధనకు సంబంధం కాని మూలాధారలనుండి బాగా ఎరిగియున్న వ్యక్తులే. యిప్పుడు అందుబాటులో ఉన్న సమాచారమునుబట్టి వారి కాలాలను నిర్ణయించవచ్చు. అందించిన సమాచారాన్ని బట్టి వీరు ఏ ఏ సంవత్సరాల కాలంలో జీవించారో అంచనా వేసి చెప్పవచ్చు. అందువల్ల ఈ సువార్త రచయితలు యేసు జీవితాన్ని ఒక క్రమమైన విధంగా కాలానికి సమయానికి ఇనుమడింపజేస్తూ చారిత్రాత్మకంగా అందించారని స్పష్టమవుతుంది. అలాంటప్పుడు ఆ సమయమేంటి, ఆ స్థలమేంటి?

### ఆయన ఎప్పుడు జీవించాడు?

యేసు జీవించిన కాలానికి మనం జీవిస్తున్న సమయానికి ఎంతో తారతమ్యము ఉన్నప్పటికి, మనం ఆయన జీవించిన సమయాన్ని ఇంచుమించు సంవత్సరాలతో సహా నిర్ణయించవచ్చు. సరే ఆయన జన్మతో ప్రారంబిద్దాం.

మత్తయి 2:1 యేసు జన్మను గూర్చి తెల్పుతూ "ఆయన హేరోదు రాజుగావున్న దినములలో" జన్మించాడు అని ఉంది (లూకా 1:5 చూడు). యేసు జీవించిన కాలంలో రోము పాలస్తీనాను అదుపు ఆజ్ఞల్లో నిలుపుకొనియున్నది. రోమా సామ్రాజ్యం యూదులు "కీలుబొమ్మ రాజులను" ఎలాంటి అధికారం లేని వ్యక్తిని కలిగియుండవచ్చు అని అనుమతియిచ్చారు. ఆ వ్యక్తులను కూడ రోమీయులే ఎంచుకొని పంపించేవారు. యిక వారి పని ఏమనగా రాజ్యంలో

జరిగేవన్నీ రోమా సామ్రాజ్యానికి అనుకూలమైనవే, రాజ్య శ్రేయార్థము చేయవలసినది అంతే. క్రొత్త నిబంధనలో ఐదుగురు హేరోదులు మనకు కనిపిస్తారు “హేరోదు” అనేది ఒక రాజు వంశం యొక్క పేరే గాని ఒక వ్యక్తి పేరు మాత్రం కాదు సుమా.[1]

యేసు యొక్క జన్మం సమయంలో పరిపాలించిన హేరోదు “మహా హేరోదు” అని ప్రసిద్ధికెక్కాడు. అతని గురించి అతని ఆసక్తివంతమైన స్వభావ లక్షణాల గురించి మనం ఎంతో తెలుసుకోగల్గినామంటే దానికి చరిత్రకారుడైన జోసీఫస్ అని చెప్పవచ్చు. హేరోదు ఎంతో క్రూరమైన వ్యక్తి. మూఢ నమ్మకాలుగలవాడు ఎంత దుష్కార్యమునకైనా వెనుకాడడు. తన అధికారానికి ఎవరు అడ్డువచ్చినా, తన శక్తి ప్రభావాలకు ఎవరైనా హాని తలపెడుతున్నారని తెలిస్తే వారిని అంతే హతమార్చేవాడు. ఈ విషయాన్ని ఋజువుపర్చే సంఘటన మత్తయి 2:16–18లో “అతడు అమాయకులను వధించడం.” ఇది బైబిలు గ్రంథ రచయితలు స్పష్టం చేయనప్పటికి, యిది అతని స్వభావ లక్షణాలకు అద్దంపడుతుంది. అలాంటప్పుడు అతడు “ఘనుడు” అని ఎందుకు పిలువబడినాడు? అతడు గొప్పవాడు అని పిలువబడడానికి గల కారణం అతని యొక్క సమర్థవంతమైన పరిపాలన మాత్రమే. రోమీయులతో సఖ్యంగా ఉన్నాడని (అతని యొక్క యూదా సమకాలికలు) అని అభిప్రాయపడుతున్నారు. అంతేగాక గొప్పగొప్ప కట్టడాల నిర్మాణ ప్రణాళికలో అతడొక అందె వేసిన చేయి. కనువిందు కల్గించే కట్టడాలు అతడు నిర్మాణం చేశాడు. వాటన్నింటిలో శ్రేష్ఠమైనది యెరూషలేము దేవాలయ పునర్నిర్మాణం, అంతేగాక దాని సమీపంలో చుట్టూ వినూత్నమైన భవనాల నిర్మాణమే (ఈ ప్రణాళిక అతని హయాంలో ప్రారంభమైంది గాని సంపూర్తి చేయబడలేదు). ఇదంతా కలిసి యేసు యొక్క జన్మదినం ఎప్పుడో అన్న విషయం కనుక్కోడానికి మనకు సహాయపడుతుందా? “మహా హేరోదు” రాజు క్రీ.పూ. 37 నుండి 4 మధ్య కాలంలో పరిపాలించినాడు అని జోసీఫస్ వ్రాశాడు. అతని పరిపాలన కాలంలో యేసు జన్మించాడని క్రొత్త నిబంధన మనకు తెలుపుచున్నది. యిక్కడ క్రీ.పూ. (“Before Christ”) అనేది కొద్దిగా సమన్వయంగానే ఉంటుంది, ఎందుకంటే యేసు క్రీ.పూ. జన్మించాడు కదా! మన క్యాలెండర్‌లో కూడ కొంత పొరపాట్లు ఉన్నది. వాస్తవానికి యేసు జన్మించినప్పటినుండి వారు లెక్క కట్ట వలసియున్నది. కాని డెన్నిస్ ది స్మాల్ (మన క్యాలెండర్‌ను నియామకం నిర్ణయం చేసిన ఒక సన్యాసి) అనే వ్యక్తి రవ్వంత తప్పుడు గణన చేశాడు. ఈ విధంగా యిచ్చిన లెక్కలను బట్టి చూస్తే యేసు క్రీ. పూ. 4 సంవత్సరములో జన్మించియున్నాడు అని విశదమవుతుంది. అంటే మహా హేరోదు అప్పటికే బ్రతికియున్నాడని, పరిపాలిస్తున్నాడని అర్థం.

మత్తయి 2:16–18 భాగాన్ని సూక్ష్మంగా పరిక్షించినట్టయితే (యేసును హతమార్చే ఉద్దేశంతో బేత్లెహేములోని ప్రతి మగ శిశువును హతమార్చినాడు హేరోదు). ఈ భయంకర సంభవం జరిగినప్పుడు బహుశ యేసు రెండేళ్ళ ప్రాయంలో ఉండియుండవచ్చు. “బేత్లెహేము పట్టణంలోను పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రతి మగ శిశువును హతమార్చుచు, క్రొత్తగా జన్మించిన బాలుడైన రాజును హతమార్చవచ్చును గదా అని హేరోదు నిశ్చయించాడు. కాల క్రమంలో జ్ఞానుల సమాచారాన్నిబట్టి శిశువుల వయస్సును అంచనా వేసుకున్నాడు.” అతడు ఈ విషయం ఎంతో జాగ్రత్తగా లెక్కలు గట్టుకొని నిర్ణయించుకున్నాడు, అందువల్ల మనం, యేసు రెండు సంవత్సరాలు అంతకంటె కొంచెం తక్కువ వయస్సుగలవాడై యుండవచ్చునని మనం భావించవచ్చు. ఈ విషయాలన్ని సమకూర్చుకొని, లెక్కలు వేసి యేసు క్రీ.పూ. 7–5

సంవత్సరాల కాలంలో జన్మించియుంటాడని ఎంతోమంది పండితులు అంచనా వేస్తారు.

మన తర్వాత వివరణ యేసు యొక్క జీవితం గురించి కాలమును నిర్ణయించుట, ఆయన యొక్క బహిరంగ పరిచర్యపై ఆధారపడివున్నది. యిక్కడ మనకు సరైన సూటైన సహాయం ఒక సువార్త ద్వారా లభిస్తుంది. లూకా 3:23 యిలా చెబుతుంది “యేసు తన పరిచర్యను ప్రారంభించినప్పుడు ముప్పది సంవత్సరాల వయసులో ఉన్నాడని” లూకా వెల్లడి చేసిన విషయం మనకంత సరైనదిగా కనబడకపోవచ్చు అంటే మనం (ఆయన 28? 30? 32 సంవత్సరాలా?) అయినప్పటికి ఫర్వాలేదు, అది మనకు సహాయకరంగానే యుంటుంది. యిక్కడ ఎంతో స్పష్టంగా కనబడేదేమంటే యేసు తనకు భందువైన బాప్తిస్మమిచ్చు యోహాను ద్వారా బాప్తిస్మం తీసుకోడానికి వచ్చేటంతవరకు ఎవరికీ కనబడకుండ ఎక్కడో మూలన జీవించినాడు అని సువార్తలు మనకు తెల్పితే, లూకా సువార్త 3:1, 2లో “తిబెరికైసరు ఏలుబడిలో పదునైదవ సంవత్సరమందు ...” యోహాను తన పరిచర్యను ప్రారంభించాడు అని గ్రహించదగును. అది బహుశ క్రీ.శ. 27-28 సంవత్సరంలో అయుండవచ్చు. అందువల్ల యిది మనం గతంలో అనుకున్నదానికి సరి పోతుంది, అంటే యేసు క్రీ.పూ. 7 లేక 5వ సంవత్సర మధ్య కాలంలో జన్మించియుంటాడని మనం అనుకున్న రీతిగానే. మరి ఆయన “ముప్పది సంవత్సరాల” వయస్కుడు అని కూడ. ఆయన ఈ వయస్సులోనే తన బహిరంగ సేవను ప్రారంభించాడు (అదే కాలంలో యోహాను కూడ తన సేవను ప్రారంభించాడు).

ఈ విధంగా, యేసు యొక్క సేవా పరిచర్య దాదాపుగా ఎంత కాలం కొనసాగియుంటుందో కూడ మనం అంచనా లెక్కలు వేసి మనం చెప్పవచ్చు. ఆయన యొక్క బహిరంగ సేవ ఆయన మరణంతో ముగిసింది, ఆయన ఎప్పుడూ మరణించాడో, ఏ వయస్సులో మరణించాడో అన్నది మనం దరిదాపుగా ఎంపిక చేయవచ్చు. అంతేకాదు ఆయనెంతకాలం సేవ చేశాడో - అది ఖచ్చితమైన అంచనావేసి చెప్పవచ్చు.

యూదులకు అత్యంత ప్రాముఖ్యమైన పస్కాపండుగకు యెరూషలేముకు ఎన్ని పర్యాయాలు వెళ్ళినాడని సువార్తలు చెబుతున్నాయో దాన్ని బట్టి మనం ఈ అంచనాలను వేసి చెప్పగలం. ఒకొక్క సమీకరణ సువార్తలు (మత్తయి, మార్కు మరియు లూకాలు). యేసు ప్రభువు ఒక్క పర్యాయము పస్కాపండుగకు యెరూషలేము వెళ్ళినాడని చెబుతున్నాయి - అది ఆయన సిలువవేయబడబోవు సమయంలో మనం గనుక వాటికే పరిమితియై ఉంటే, మన ముగింపు ఎలా ఉంటుందంటే, ఆయన యొక్క బహిరంగ పరిచర్య మొత్తం ఒక సంవత్సరంలో ముగిసింది అని (అంటే ఆయన బాప్తిస్మ సమయం, అరణ్యంలో శోధన, చివరకు ఆయన మరణం). ఏది ఎలావున్నా యోహాను సువార్త మాత్రం ఆయన రెండు లేక మూడు సంవత్సరాలు పరిచర్య కొనసాగించినాడు అని తెలుపుతుంది. ఎందుచేతనంటే, పెంతెకొస్తు పండుగకు మూడు ప్రత్యేక సందర్భాల్లో యేసు యెరూషలేముకు వచ్చాడంటూ యోహాను సువార్త చెబుతుంది (యోహాను 1:13; 6:4; 11:55). ఇదంతా రెండు లేక మూడు సంవత్సరాల కాల వ్యవధిలో జరిగింది అని చెప్పవచ్చు. ఆయన యొక్క బహిరంగ పరిచర్య గనుక క్రీ.శ. 27-28 మధ్య కాలంలో జరిగివుంటే ఆయన క్రీ.శ. 30లో మరణించియుంటాడని భావించవచ్చు. ఈ విధంగా ఇది బైట ప్రపంచ రీత్యా లభించే మూలాధారాలను (అంటే బైబిలు కానివి) బట్టి యేసు గురించి మరియు సంఘ పరిచర్య యొక్క ఉద్యమం (సంఘం) ఎలా ప్రారంభమైనదో చెప్పవచ్చు. అది ఆ కాలానికి సమతూగుతుంది.

"యేసు ఎప్పుడు జీవించాడు" అనే ప్రశ్నకు మనం ఆయన క్రీ.పూ. 7–5వ సంవత్సర కాలంలో పుట్టినాడంటూ ఎంతో సులువుగా జవాబివ్వవచ్చు – మరి ఆయన బహిరంగ పరిచర్య క్రీ.శ. 27–28 సంవత్సరాల్లో జరిగిందనీ, ఆయన క్రీ.శ. 30వ సంవత్సరంలో మరణించాడని యిట్టే చెప్పవచ్చు. ఈ లెక్కలు, గణాంకాలాన్ని రెండువేల సంవత్సరాలు క్రితం జరిగినవే.

## ఆయన ఎక్కడ జీవించాడు?

క్రొత్త నిబంధన ఈ విషయంలో కావలసినంత ఋజువు అందిస్తుంది (యితర మూలాధారాల వలె) అది ఏమనగా, పాలస్తీనా అని పిలువబడుచున్న, గొప్ప పేరుగాంచిన దేశంలో యేసు జీవించి, మరణించాడు.

ఈ ప్రదేశానికి ఎంతో గొప్ప సుధీర్ఘమైన చరిత్రవుంది. కాని తరుచూ విషాధచాయలు చరిత్రలో అలుముకున్నాయని చెప్పక తప్పదు. "ఇశ్రాయేలు ప్రజలు" అంటూ పిలువబడక పూర్వమే దేవుడు ఇశ్రాయేలు ప్రజలకు ఈ వాగ్దాన దేశాన్ని యిస్తానని వాగ్దానం చేశాడు. వారు ఐగుప్తు బానిసత్వం నుండి తప్పించుకొనిన తరువాత దేవుడు వారి యొక్క అవిశ్వాసాన్నిబట్టి వారిని నలుబది సంవత్సరాలు అరణ్యంలో నడిపించాడు. (వాస్తవానికి వారు నలువది సంవత్సరాలకు పూర్వమే దేవుని వాగ్దానాన్ని పొందియుండేవారు! సంఖ్యాకాండము 13; 14 చూడు.) చిట్టచివరిగా, వారు యోర్దాను నది దాటి వాగ్దాన దేశంలో ప్రవేశించారు. ఆ సమయంలో ఆ దేశం "కానాను" దేశం అని పిలువబడింది, "కనానీయులు," అనబడినవారు నివసిస్తున్నారు. ఎప్పుడైతే ఇశ్రాయేలీయులు ఈ దేశాన్ని ఆక్రమించుకున్నారో అది "ఇశ్రాయేలు" దేశమని పిలువబడింది. తరువాత రోమీయులు ఆ దేశానికి "పాలస్తీనా" అని నామకరణం చేస్తూ ప్రత్యేకించారు. కాబట్టి యిప్పుడు పై రెండు పేర్లతో పిలువబడుచున్నది.[2]

పాలస్తీనా ఒక చిన్న దేశం. యేసు జీవించిన కాలంలో అది మేరిలాండ్ రాష్ట్రమంత సైజులో వుండేది లేదా ఆఫ్రికాలోని టోగో అనే దేశంలోని సగం సైజుగావుండేది మాత్రమే. ఎప్పుడైతే ఇశ్రాయేలీయులు ప్రవేశించారో, ఆక్రమించుకున్నారో అది సస్యశ్యామలమైయింది, అయినప్పటికి చరిత్రలో కొన్ని అవరోదాలు ఎదుర్కొనక తప్పలేదు. ఇది మెసపటోమియా, ఐగుప్తులకు మధ్యవున్న భూభాగం (యిక్కడే ఆస్సీరియా, బాబిలోను, పర్శియా రాజ్యాలున్నాయి). పాలస్తీనా చాలా "చిన్న భూభాగమైనప్పటికి" గొప్ప పేరుగాంచి ఆశించగల దేశమైయున్నది. సైనిక దళాలు దండయాత్రలు ఆయా రాజ్యాల మధ్య చెలరేగినప్పుడు ఈ పాలస్తీనాకు ప్రత్యేకమైన ప్రాధాన్యత యిచ్చారు. ఇది తన కంటె అత్యధిక శక్తివంతమైన దేశాలకు ఒక "తలుస్థమైన" దేశంగా తరచుగా నిలిచింది. (సౌలు, దావీదు, సొలొమోను) పరిపాలించిన సమయంలో రాజకీయ స్వాతంత్ర్యాన్ని, బలాధికార్యాన్ని కలిగి ఎంతో గొప్పగా విలసిల్లింది, తర్వాత ఎంతో నిరాధారమైన బలహీన దేశంగా నిలిచిపోయింది. ఈ భూభాగం ఎంతో ప్రాముఖ్యమైంది. వ్యూహాపరమైన అధికార లాంచనాలుగలదిగా యున్నందున అనేక శక్తివంతమైన అన్య దేశాలు తాకిడికి తట్టుకొంటూ, తలవంచవలసివచ్చింది.

యేసు జీవించిన కాలంలో బాగా అధికారం చెలాయించిన శక్తివంతమైన రాజ్యం రోమా సామ్రాజ్యం. ఇది క్రీ.పూ. 63లో పాలస్తీనాను వశపరచుకొని అప్పటినుండి క్రొత్త నిబంధన యుగం తర్వాతవరకు తన అధికారం క్రింద ఉంచుకొన్నది. అస్సీరీయులు, బబులోనీయులు

పారసీకులు, గ్రీకులు, రోమీయులు నిరాశ, నమ్రతతోవున్న ఈ దీన దేశాన్ని వారి వారి వశంలో త్రొక్కిపెట్టియుంచారు. యోహాను 8:33 ప్రకారం కొందరు యూదులు "మేము అబ్రహాం సంతానం, మేము ఎన్నడును దాసులమై ఉండలేదు" అన్న మాటల ప్రకారం చరిత్రలో ఆ ప్రజలు తమ గొప్ప పేరును. బలాధిక్యాన్నిబట్టి ఎంత అతిశయించాలో తెలుస్తుంది. వాస్తవానికి వారు అందరిలాగనే బానిసత్వకోరల్లో చిక్కుకున్నవారే. వారీవిధంగా చెబుతున్నప్పటికి వారు విడుదలగల్గిన ప్రజలైయున్నారని భావించనక్కరలేదు సుమా! రోమీయులు పూర్తిగా అధికారం చెలాయిస్తున్నారు. హేరోదు ఒక "కీలు బొమ్మ" లేక "ఆట బొమ్మ" అధికారిగా మాత్రమే పరిపాలించడానికి అనుమతి జారీ చేశారు. ఈ హేరోదులు అనబడినవారు స్వచ్ఛమైన యూదా రక్త సంబంధికులు కాదు సుమా! వారు ఏశావు సంతతివారనబడిన యూదేతరులు, లేదా వారు యాకోబు కవలపిల్లలని పిల్వబడుచున్న సహోదరులు (మరో విధంగా చెప్పాలంటే వారి మరో పేరు "ఇశ్రాయేలు"). ఏదోమీయులు యూదుల ద్వారా ద్వేషించబడినారు. అందువల్లనే యేసు జన్మ సమయంలో యూదా జాతి పాలస్తీనాలో రాజకీయపరంగాను, ఆధ్యాత్మికంగాను గొప్ప సంక్షోభంలో కొట్టుమిట్టాడుచున్నది. ఇలాంటి గందరగోళ సమయంలోనే యేసు జన్మించాడు, మరణించాడు కూడ.

యేసు జన్మ స్థలాన్ని గురించి స్వచ్ఛమైన, స్పష్టమైన అవగాహన మనం కలిగియుండగలం. యెరూషలేముకు ఐదు మైళ్ళదూరంలో ఉన్న బేత్లెహేంలో ఈ సంఘటన జరిగిందని మత్తయి లూకాలు వ్రాస్తున్నారు (మత్తయి 2:1; లూకా 2:1-7). ఏదిఎలాగైనా యేసు "గలిలయుడు" అని పిలువబడినాడు. ఈ గలిలయ పాలస్తీనాకు ఉత్తరాన చివరి భాగాన యున్నది. ఆయన దక్షిణాన ఉన్న బేత్లెహేములో ఎందుకు జన్మించవలసివచ్చింది? ఎందుకో అన్న కారణాన్ని లూకా వివరిస్తున్నాడు. ఎందుచేతనంటే జనాభా లెక్కల కారణాన ప్రతి కుటుంబం ప్రతి పెద్ద లెక్కలోకి రావలసియున్నది కూడ. అందువల్ల యేసు యొక్క తలిదండ్రులైన మరియ యోసేపులు నజరేతులోని గలిలయనుండి బేత్లెహేము వరకు సుదూర ప్రయాణం కొనసాగించవలసివచ్చింది. యోసేపు "దావీదు సంతతి, అతని యింటివాడు." లూకా సువార్తలో చెప్పబడిన రీతిగా అతడు "దావీదుపురమని" పిలువబడిన బేత్లెహేములో హాజరు కావలసియున్నది. అలాంటప్పుడు అతడు తన భార్యను అర్ధాంతరంగ వదలివెళ్ళడం భావ్యం కాదు కాబట్టి యిద్దరు కలిసి ఆ బడలికతో కూడిన ప్రయాణం చేయవలసియున్నది. అక్కడికి వెళ్ళిన వెంటనే యేసు వారికి జన్మించాడు. యోసేపు అతని కుటుంబం అంతా ఎలా ప్రయాణం చేసినారో అన్నది అంత వివరణాత్మకంగా లేదు. లూకా 2:39లో వివరించినదేమంటే యేసు యెరూషలేం దేవాలయంలో ప్రతిష్ఠింపబడడానికి తేబడినాడు అని. అది యేసు నలుబది దినముల చిరు ప్రాయం ఉన్నప్పుడు అని అర్థం చేసుకోవచ్చు (లేవీయకాండము 12:1-6), "వారు గలిలయలోని తమ స్వంత పట్టణమైన నజరేతుకు తిరిగి వెళ్ళినారు." ఎలాగైనా మత్తయి 2:13-23వరకు చూచినట్లయితే, యేసు జన్మించిన తర్వాత యోసేపు తన కలలో, ఐగుప్తుకు పారిపోవలసిందిగా హెచ్చరించబడినాడు ఎందుకనగా హేరోదు శిశువుగావున్న యేసును సంహరించవలెనన్న దురుద్దేశంతో యున్నాడు కాబట్టి. ఆ విధంగా దైవికపరమైన జోక్యంవల్ల క్రమక్రమంగా వారు తమ స్వగృహమైన నజరేతుకు తిరిగి చేరుకున్నారు. యిలా "ఐగుప్తుకు పారిపోవడం" అనేది లూకా 2వ అధ్యాయంలోని సంఘటనల అనంతరమే జరిగింది అని చెప్పాలి. సరైన కాలం గురించి నిర్ణయించేకంటే

యేసు నజరేతులో పెరిగి పెద్దవాడయ్యాడని నిర్ధారించవచ్చు (లూకా 4:16).

## ఆయన ఎలా జీవించాడు?

యేసు యొక్క వంశావలి పుట్టుపూర్వోత్తారాల గురించి మనం ఎంతో తెలుసుకున్నాము; ఎందుచేతనంటే మత్తయి 1వ అధ్యాయం లూకా 3వ అధ్యాయాలు ఆయన వంశావళిని గురించి సవివరంగా ప్రతి వివరాన్ని మనకు అందించియున్నారు కాబట్టి. యిలాంటి వంశావళుల వివరణలు అందించడం అనేది యూదా సమాజంలో తరతరాలుగా వస్తున్న ఆచారం. అలా చేయడంవల్ల ఒక వ్యక్తి చట్టపరంగా ఆధ్యాత్మికంగా ఎవరి వారసత్వమో నిర్ధారణ చేయవచ్చు, పాత నిబంధనలో యిలాంటి వివరణాత్మకంగా అనేక పర్యాయాలు యివ్వబడ్డాయి. మత్తయి సువార్త కూడ మత్తయికి తన గ్రంథ ప్రారంభంలోనే యేసు వంశావళిని పనిగట్టుకొని యివ్వడంలో అతనికి యేసు యొక్క వంశావళి ఎంత ప్రాముఖ్యమో గ్రహించగలం. ఈ వంశావళిలలో పొందుపర్చబడిన ఆయన పేర్లు చదవడం మనకెంతో కష్టంగా ఉండవచ్చు, ఇబ్బందికరంగాను ఉండవచ్చు. కాని మొదటి శతాబ్దపు యూదునికి ఆ పేర్లు చదవడం అనగా పాత నిబంధనతో ప్రారంభమైన పేర్లు మొదలు కొని యేసు జన్మవరకు గల పేర్లన్ని ఎంతో సులభంగా వల్లించడం చాలా సుళువుగా సాగిపోతుంది. అంటే ఎలావుంటుందంటే ఒక కుటుంబముయొక్క పోటో ఆల్బం ఎలా త్వరత్వరగా చూడగలమో అలాచూడగలం, యిక్కడ ప్రతి పేరు వెనుక ఒక చక్కని కథ నిక్షిప్తం అయివుంది, అదే యూదా ప్రజల చరిత్ర యొక్క విశిష్ఠత అని చెప్పాలి.

మత్తయి ఈ వంశావళి యొక్క ప్రాధాన్యతను అనుసరిస్తే లూకా కొంత దాటి వెళ్ళి వివరాలిచ్చినాడు. ఈ రెండింటికి ఒక దానికొకటి పొంతనలేదు. మత్తయి "యూదా ప్రజల పితరుడైన" అబ్రాహాముతో ప్రారంభించి యిక ముందుకు సాగి యేసును గూర్చి వివరించడానికి పూనుకున్నాడు. లూకా విధానం మరోవిధంగా ఉన్నది అతడు యేసుతో ప్రారంభించి ఒక్కసారి వెనక్కు ఆదాము వరకు చివరకు దేవుని వరకు కూడ వివరణాత్మకంగా వ్రాస్తున్నాడు. దీనంతటికి అనగా ఈ వ్యత్యాసానికి గల కారణం వీరిద్దరు వంశావళులు యివ్వడంలో వేరు వేరు ఉద్దేశాలు కలిగియుండడమే. మత్తయి యేసును పూర్తిగా ఇశ్రాయేలీయునిగా లోకానికి కనబర్చాలని ఆయన దావీదు సంతతివానిగాను ఇశ్రాయేలు యొక్క అసలైన మెస్సీయ అని స్పష్టం చేయడానికి వ్రాసియున్నాడు. లూకా ఉద్దేశం పూర్తి "విశ్వాన్నే" చుట్టువచ్చినంత వివరణాత్మకంగా వ్రాస్తూ, యేసు వంశావళి యూదుడు మాత్రమే కాదు పూర్తి మానవాళితోనే ఆయన బాంధవ్యం ఉన్నట్లు వివరిస్తున్నాడు. ఈ సువార్తలన్ని, యూదా చరిత్రలో యేసుకు ఆయన కుటుంబానికి ఒక ప్రత్యేకతను సంతరింపజేయడానికి ప్రయత్నిస్తున్నాయి. ఆయన యూదా వంశానికి చెందినవాడు, ఇశ్రాయేలులోని అత్యంత ప్రముఖులైన వ్యక్తుల వంశావళినుండి వచ్చినవాడనియు, అంతేకాదు ఎంత భయంకరమైన పాపాత్ములనుండి కూడ వచ్చాడని స్పష్టం అగుచున్నది.

యోసేపు మరియల గురించి మనకు బహుశ తక్కువగా తెలుసు. వాస్తవానికి వారు సగటు సాధారణమైన యూదా దంపతులు, వారి కుమారుడే వారికి ఘనత. యోసేపు పాట్లు పడి పనిచేసుకొని జీవించేవాడు, వడ్లపనివారు (మత్తయి 13:55) యేసు కూడ బహుశ తన దగ్గర పని నేర్చుకున్నాడు కూడ. ఈ రోజున కూడ "నజరేతు వడ్రంగివాడు" అన్న

పేరుసంతరించుకొన్నాడు. అసలు యోసేపు గురించి ఏమంత ఎక్కువ చెప్పబడలేదు. (లూకా సువార్తలో కంటే మత్తయి సువార్తలో ఎక్కువ చెప్పబడింది; మార్కులో అసలు ఆయన పేరు ఎత్తనే ఎత్తలేదు.) యేసు చరిత్రలో ఆ తర్వాత యోసేపుకు ఎలాంటి పాత్రలేదు. అంటే కొంత మంది అనుకొనేదేమంటే యేసు పెరిగి పెద్దవాడయ్యే లోపల యోసేపు మరణించాడు అని, ఆ వివరాలను ఎవరూ అంతగా పట్టించుకోలేదు, పట్టించుకునే అవసరంకూడ లేదు.

మత్తయి, మార్కు సువార్తల్లో నమోదు చేయబడిన కన్యక గర్భం ధరించి కనడం అనే విషయం కారణంగా ("కన్యక గర్భం ధరించడం" ఎంతో సూటిగా వివరించడంలాంటిది) మరియను యోసేపుకంటే ఆసక్తికరమైన రూపంగా (వ్యక్తి) మనం చూస్తాం. యేసు జన్మించిన సమయంలో మనం ఆమెను ఒక పరిణత చెందిన యువతిగాను, దాదాపు యోసేపునకు సమాన వయస్కురాలిగాను వివరించడం జరుగుతుంది. ఔను ఆ దినాల్లో యూదా బాలికలు పన్నెండునుండి పద్నాలుగు సంవత్సరాల ప్రాయంలో "ప్రధానం" చేయబడి వివాహాన్ని కూడ చేసుకునేవారు. గాబ్రియేలు ఆమెకు కనిపించి ఈ విషయం ప్రకటించిన సంఘటన పై యిది మనకింకా స్పష్టంగా తెలియుచున్నదిగదా! చూడండి పద్నాలుగు సంవత్సరాలైనా నిండని ఒక అవివాహిత యువతి గర్భం ధరించి దేవుని కుమారుని కనడం అనేది వినడానికి విడ్డూరంగా లేదు! ఆ వార్తవిన్న మరియ "ఇదిగో ప్రభువు దాసురాలును; నీ మాట చొప్పున నాకు జరుగును గాక అనెను. అంతట దూత ఆమె యొద్దనుండి వెళ్లెను" (లూకా 1:38). మరియ యొక్క భక్తి భావాలు, విశ్వాస నిరీక్షణల సాక్షానికి అద్దంపడుతున్నాయి. యేసు జననం తర్వాత మరియ సువార్తల భాగాల్లో అంతగా కనిపించదు సుమా! ఆ గొప్ప అద్భుత శక్తులు ఆమెకు ఆపాధించబడలేదు లేదా క్రైస్తవ విశ్వాసం, ఆరాధన అనేవి ఆమెకు యివ్వబడిన సమాజంలో తానొక పేరుగాంచిన స్త్రీగా నిలిచియుండాలన్న బాధ్యత ఆమెకివ్వబడలేదు. ఆమె ఒక అభినందనీయ లక్షణాలుగల వ్యక్తిగా కనబర్చబడింది, అంతేగాని ఆమె ఏవిధంగా కూడ పవిత్రురాలు అన్న రీతిగా కనబర్చబడలేదు. ఒక సామాన్యురాలుగానే కనబర్చబడింది (మార్కు 3:21, 31-35); క్రొత్త నిబంధన ఆమెనొక దైవభక్తిగల తల్లిగానే చిత్రీకరించింది తప్ప అంతకంటె ఏమి లేదు.

యూదా సమాజంలో మరియ యోసేపుల ఆర్థిక స్థాయిని (అంటే యేసుది కూడ) గమనించినట్టయితే వారు అట్టడుగు వర్గానికి చెందినవారు. ఆనాటి పరిసయ్యులు సద్దూకయ్యులు యూదా సమాజంలో అధికారాన్ని పలుకుబడిని వారి హస్తగతంచేసుకొని ఈ ప్రజలను "దేశప్రజలే" అంటూ ఏదో కించపరచినట్టు పిలిచేవారు. దీన్నెలా తెలుసుకున్నాం? యిక్కడ లూకా 2:22-24 కొంత జవాబు లభిస్తుంది. అదెప్పుడంటే, యేసు బాలుడుగా ఉన్నప్పుడే యెరూషలేం ఆలయంలోకి తీసుకొనిపోబడినప్పుడు, మోషే ధర్మశాస్త్రం ప్రకారం యూదా సమాజంలో మొదటి సంతానం గల తలిదండ్రులు దేవునికి అర్పించడానికి గొఱ్ఱె పిల్లను తేవాలి. కాని అది తేలేని వారు దానికి బదులుగా ఒక జత గువ్వలనైనా తేవచ్చు లేదా రెండు పావురాల పిల్లలనైనా తేవచ్చు (లేవీయకాండము 12:6-8), యింకా చెబుతున్ననట్లు ఎంతో బీదరికాన్ని కనబర్చే కానుక యేసు నిమిత్తం అర్పించబడింది. యోసేపు మరియలు పాలస్తీనా సమాజంలో ఆర్థికపరంగా అట్టడుగు వర్గానికి చెందిన వారని మనం యిట్టే చెప్పగలం; అయినప్పటికి వారంత దిక్కులేని వారని మాత్రం మనం చెప్పకూడదు. యోసేపు కష్టించి పనిచేసేవాడు కాబట్టి కుటుంబ పోషణార్థం అనుకున్నంతగా సంపాదించగలవాడు

కాదని అర్థం అవుతుంది.

యేసుకు తనతోటి సోదరసోదరీలు కూడ ఉన్నారు. ఆ యింట్లో ఆయనేమి ఏకైక కుమారుడు కాదు. యింటినిండా పిల్లలున్న గృహంలో ఆయన పెరిగి పెద్దవాడయ్యాడు. నాలుగు సువార్తలు కూడ యేసుకు తనతోటి సోదరసోదరీలను గురించి ఎంతో వివరంగా చెబుతున్నాయి (మత్తయి 12:46, 47; మార్కు 3:31, 32; లూకా 8:19, 20; యోహాను 7:1-5). మత్తయి, మార్కులు ఆ పిల్లల పేర్లను కూడ వివరిస్తున్నారు: యాకోబు, యోసేపు, సీమోను మరియు యూదా. యోహాను ఎంతో వివరణగా యిలా అంటున్నాడు: యేసు యొక్క సోదరులు ఆయన భూమి మీద ఉన్నంతవరకు ఆయనను నమ్మలేదు. మత్తయి మార్కులు యేసుకు సోదరీలు కూడ ఉన్నారు అని చెప్పుచున్నారు (మత్తయి 13:56; మార్కు 6:3) కాని వారు పేర్లు మాత్రం యివ్వబడలేదు. ఇది ఆనాటి యూదా సమాజంలో ప్రతీక. క్రొత్త నిబంధన యిస్తున్న వివరాలకు తోడుగా జోసీఫస్ అందిస్తున్న సమాచారంలో యేసుకు యాకోబు అని పిల్వబడిన సోదరుడున్నాడని, అతడు యూదా అధికారుల వద్ద హాజరుపర్చబడి నాడని చెప్పబడింది. కొందరేమని అభిప్రాయపడుచున్నారంటే యేసు యొక్క సోదర సోదరీలు ఆయన చిన్నాయిన పెద్దనాన్నల పిల్లలు అని (కజిన్స్) లేదా మారు తల్లి పిల్లలని. ఎందుకంటే యోసేపు అంతకుముందే వేరే స్త్రీని పెళ్ళిచేసికొన్నాడని, (అంటే ఈ ఆలోచన వెనుక చారిత్రాత్మక ఆధారాలేమి లేవు). యివన్ని కూడ వేదాంత పరమైన ఆధారాలను నీరుగార్చడానికైన ప్రయత్నంలో వాడబడినవే. వాస్తవంగా ఉన్న అభిప్రాయమేమంటే మరియ యోసేపులకు యింటినిండా పిల్లలేనని (ఏడుగురు అని దాంట్లో యిద్దరు ఆడపిల్లలు) అది మొదటి శతాబ్దపు యూదా సమాజ విధానంలో ఉందని చెప్పవచ్చు. ఈ ఋజువులన్ని కొంత వాస్తవాన్ని అందిస్తున్నాయి. ఈ ఋజువులన్ని కొంత అర్థవంతంగానే యున్నాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

**యేసుని జీవన శైలి**

యేసుకు "గృహం లేనట్లు" గానే చిత్రీకరించబడినది, ఆయన ఒక సారి యిలా అన్నాడు, "మనుష్య కుమారునికి తలవాల్చుకొనుటకైనను స్థలములేదు" (మత్తయి 8:20) మరియు యేసు గలిలయ ప్రాంతమంతా సంచరించాడని యూదయ దక్షిణ ప్రాంతంలో కూడ ఆయా సందర్భాల్లో అడుగుపెట్టినాడని సువార్తలు వివరిస్తున్నాయి. అంటే ఆయన ఎక్కడకు వెళ్ళినా అక్కడ ఏదో ఒక గృహంలో తన కాలాన్ని గడిపినాడని (అంటే తల మీద నీడ) ఆశ్రయం కలిగివున్నాడని అర్థమవుతుంది.

"ఆరోగ్యం సౌభాగ్యానికి" సంబంధించిన సువార్తను ప్రతిపాదించే కొందరు వాదులు (అంటే ప్రజలందరూ ఆస్థిపరులై సౌభాగ్యవంతంగా జీవించాలని దేవుడు కోరుతున్నాడు అని వాదించే వాదులు) వీరు యేసును వారి వారి విధానంలో చిత్రీకరిస్తారు. యేసు గొప్ప సౌభాగ్యవంతుడని వారంటారు. అందువల్ల విశ్వాసులందరూ ధనవంతులు కాడానికి పాటుపడాలి అంటారు. వీరంతా యింకా యిలా అంటారు - యేసు అనేక విలువైన బహుమానాలు "బంగారు, సాంబ్రాణి, బోళము" (మత్తయి 2:11) పొందియున్నాడు కాబట్టి ఆయనకు కావలసినంత డబ్బు భాగ్యాలున్నాయి. అందుకే ఆయనతో కలసి ప్రయాణం చేసిన ప్రయాణికులు కూడ సహాయం చేసి యుండవచ్చు. యేసు ధనికుడు అని నిర్ధారించారు.

ఆయన ఎంతో పేదరికంగా ఉన్న సందర్భాలు మాటలు వింటున్నాం కాబట్టి ఆయనకు ఆస్థిపాస్తులున్నట్లు కనబడదు సుమా! ఆయన బోధల్లో కూడ యిలాంటి సూచనలేమి కనబడువు కూడ (మత్తయి 8:20; లూకా 12:13–21; 16:19–31). కొంతమంది ఈ రోజుల్లో ఆస్థిపాస్తులు ప్రాముఖ్యతను గురించి మనసు చేసేవారి పట్ల ఇది వ్యతిరేకంగా స్పందిస్తుంది. అంతేగాక యేసు తన వద్దవున్న శిష్యుల గుంపు యొక్క అవసరతల కోసం తానేమి యివ్వలేదు. లూకా 8:1–3లో చూచినట్టయితే ఆయనతో కలిసి ప్రయాణం చేస్తున్న స్త్రీలు, “వారి అవసరతలకై వారి దగ్గరున్నవి పంచుకున్నారు, ఖర్చు చేశారు” అంతే.

యేసుకు అనేకులైన శత్రువులు ఉన్నారు అనే నానుడి కలదు. సువార్తలు ఏమంటున్నాయంటే యేసుకు ఎంతో మంది గౌరవప్రతిష్టలుగల స్నేహితులున్నారని వాడుక. ఈ పన్నెండు మంది అపొస్తలుల మూడు సంవత్సరాలుగా ఆయనను వెంబడించారు. ఆయన దగ్గర అనేక విషయాలు నేర్చుకున్నారు కూడ. అపొస్తలుల కార్యములు 1:15–26 భాగం చదివినట్టయితే యేసుతో యింకా అనేకులు యితరులు కూడవున్నారు అని తెలుపుచున్నది. అంతేగాక ఆ సమయంలో యూదా ఆయన యొక్క బహిరంగ పరిచర్య అంతటి కాలంలో ఆయనతోవున్నాడు ఆర్థిక విషయల బాధ్యత వహించాడు. లూకా 8వ అధ్యాయంలో చెప్పినట్లు ఆయా సందర్భాల్లో అనేకమంది యేసుతో కలిసి ప్రయాణం చేశారు వారి లెక్కలు వివరంగాలేవు. లూకా 10:1లో యేసు డెబ్బై మందిని పంపించాడని అంటే ఆయన పట్టణాలకు వెళ్ళాలనుకున్నాడో ఆ ప్రాంతాలకు పంపియున్నాడు. బహుశ వీళ్ళందరిని యేసుకు స్నేహితులని పిలువవచ్చు.

లూకా 10:38–42 యేసు మార్త మరియల గృహాన్ని దర్శించేవాడని తెలియజేస్తుంది. తర్వాత 11వ అద్యాయంలో వీరికి లాజరు అనే సహోదరుడున్నాడని తెలుసుకుంటున్నాము. యేసు వారిని వారితమ్ముణ్ణి ఎంతో అభిమానించి ప్రేమించాడని (3, 5, 36 వచనాలు) ఎంతో సన్నిహితుడైనాడు. ఆయనకు ఎంతోమంది స్నేహితులైనారో చెప్పలేంగాని, యేసు సంప్రదించి సంభాషించిన వ్యక్తులు ఆయనతో ఎంతో సన్నిహితుడైనాడు. ఆయనకు ఎంతమంది స్నేహితులున్నారో చెప్పలేం గాని, యేసు సంప్రదించి సంభాషించిన వ్యక్తులు ఆయనతో ఎంతో సన్నిహితంగా, స్నేహభావంతో మూగారు. ఆయన యూదా సమాజంలో ఏ మూలకెళ్ళినా, ముఖ్యంగా ప్రజలు వెళ్ళడానికి కూడ అసహ్యించుకున్న ప్రాంతాలకు సైతం ఆయనవెళ్ళి ఎంతో మందిని స్నేహితులుగా చేసుకున్నాడు (లూకా 15:1, 2; 19:1–10).

**భాషా, విద్య, ప్రయాణాలు?**

ఎంతో ఘనంగా ప్రారంభించబడిన ఆయన పరిచర్య, కొనసాగిన మూడు సంవత్సరాల్లో యేసు జీవితం విధానం గమనిస్తే ఆయనెంతో సామాన్యమైన జీవితం జీవించేవాడని అర్థమవుతుంది. ఈ విషయం గురించి సువార్తలు అంతగా తెల్పడం లేదు. అంటే, ఆయన రెండు సంవత్సరాల ప్రాయంనుండి ముప్పది సంవత్సరాల ప్రాయం వరకు ఉన్న విషయాలనే సువార్తలు ప్రస్తావించలేదు (అంటే ఆయన పన్నెండు సంవత్సరాల ప్రాయంలో జరిగిన సందర్భం తప్ప). వాస్తవంగా ఆయనొక సాధారణ సామాన్యమైన యూదా యువకునిలాంటి జీవితం జీవించాడు.

సమాజంలో ఒక సామాన్యమైన యూదినిగా యేసు ఏ భాషమాట్లాడి నాడు? దానికి

వెంటనే ఆరామీయ భాష అని యిట్టే చెప్పవచ్చు. అది హెబ్రీ భాష యొక్క మాండలిక భాష, పాలస్తీనాలో అందరూ మాట్లాడుకునే వాడుక భాష. సువార్తల్లో మనం గమనించినట్టయితే యేసు ప్రభువు వాడిన మాండలిక పదాలు మనకు తటస్థపడుతుంటాయి. "అబ్బా" అన్నాడు అంటే తన తండ్రిని "తండ్రి" అని సంభోదించడానికి (మార్కు 14:36); ఆయన సిలువనుండి వేసిన కేక "*ఏలి, ఏలి, లామాసబక్తాని*" "ఓ దేవా దేవా నన్నెందుకు చేయివిడిచితివి?" (మత్తయి 27:46). ఆయన గలిలయాలో పెరిగి పెద్దవాడైనాడు, గనుక ఆ గలిలయలో హెల్లేనీయుల నాగరికత చోటు చేసుకుంది అంటే దాదాపు గ్రీకు విధానమైన సిప్పారీస్ అనే పట్టణంలాంటి నాగరికత, బహుశ ఆయన కొయినే గ్రీకు ("సామాన్య" అనేది "ప్రాచీన" పదమునకు భిన్నమైనది) మాట్లాడెను.[3] యిక్కడ గ్రీకు భాష ఆ దేశపు రాజ భాషగా వాడాలన్న ఒత్తిడి శాసనాలు ఆ భాషను మధ్యదార సముద్ర ప్రాంతమంతా ఒక అధికార భాషగా, వాణిజ్య విక్రయాల్లో, ఉత్తర మధ్యధరా ప్రత్తుత్తరాల్లో సముద్ర తీర ప్రాంతాలంతా వాడవలెను అని ఆదేశాలు జారీ అయినాయంటే దాని వెనుకనున్న అర్థం అలెగ్జాండర్ చక్రవర్తి ఆ ప్రాంతాన్ని హెల్లేనీయుల నాగరికతతో ప్రభావితం చేశాడని (గ్రీకు నాగరికత ఖచ్చితంగా ప్రభువుపై రుద్దినాడు). అది మూడు శతాబ్దాల క్రమమై అది ఆ సమయంలో పాలస్తీనా రోమా పరిపాలన క్రిందయుండియున్నది. అందువల్ల యేసు లాటిన్ కూడ మాట్లాడినాడని, ఆయనకు ఆ భాష అర్థమవుతుందని కూడ తెలుసు. పిలాతు యేసును తీర్పుతీర్చడానికి కొన్ని ప్రశ్నలు వేశాడు. అప్పుడు వాడిన భాష అదే. లేదా ఒక మధ్య వ్యక్తి ఆ భాషను అంత ధారాళంగా మాట్లాడక పోయినప్పటికి, పిలాతు అరామిక్ భాష మాట్లాడి యుండవచ్చు. మనం యిలాంటప్పుడు ఒక నిర్ణయానికి రావచ్చు. యేసుకు అరామిక్ భాష అంటే ఎంతో యిష్టం. ఆ భాషను "ప్రేమించినాడు," అందుచేత ఆయనకు గ్రీకు లాటిన్ భాషలు వచ్చి యుండవచ్చు.

యేసు ప్రభువు ఈ భాషా పరంగా ట్రయినింగ్ (తర్ఫీదు) పొందినాడన్న వివరాలు క్రొత్త నిబంధనలో మనకు కనబడవు. యూదా కుటుంబాలు వారివారి పిల్లలకు వారి గృహాల్లోనే చదువు నేర్పించేవారు అదేవిధంగా యేసు నేర్చు కొనియుండవచ్చు. అంతేగాక స్థానికంగానే నజరేతుల్లో ఉన్న సమాజ మందిరంలో హాజరై కొన్ని ఉపదేశాలు పొందియుంటాడు. (ఆయన సమాజ మందిరమునకు తరుచుగా వెళ్ళుచుండెనని లూకా 4:16 సూచిస్తుం.) కొంతమంది, సంపన్నులైన యూదులు యింటివద్దనే చదువు చెప్పే టీచర్లను (ట్యూటర్స్) ఉద్యోగానికి పెట్టుకునేవారు, కాని యోసేపు కష్టించి పనిచేసుకునే వడ్రంగి కాబట్టి ఆ విధంగా యేసుకు యింటివద్ద చెప్పే టీచర్స్‌ను ఏర్పరచుకొనే స్తోమత లేదు. ఎందుచేతనంటే అతడంత విలాసవంతమైన జీవితాలను కలిగియుండలేదు. లూకా 2:41-52. యేసు పండ్రెండు సంవత్సరాల ప్రాయంలో యెరూషలేం దేవాలయంలో ధర్మశాస్త్ర బోధకులతో, పండితులతో సంభాషించినప్పుడు "ఆయన మాటలు వినిన వారందరు ఆయన ప్రజ్ఞకును ప్రత్యుత్తరములకును విస్మయమొందిరి" (47 వచనం). యిక్కడ యేసు యొక్క విద్యా పరిజ్ఞానం గురించి లూకా ప్రత్యేకంగా ఆయన దేవుని కుమారుడై ఉన్నందున స్వతహాగ ఆయనకు ఆ జ్ఞాన వివేచనలు అబ్బి ఉంటాయని స్పష్టం చేస్తున్నాడు. ఈ సందర్భం, సంఘటన గురించి లూకా ఈ విధంగా వివరించాడు, "అంతట ఆయన వారితో (మరియ మరియు యోసేపు) కూడ బయలుదేరి నజరేతునకు వచ్చి వారికి లోబడియుండెను" (51 వచనం). కాబట్టి చెప్పుచున్నదేంటంటే, యేసు తన బాల్యాన్ని ఎంతో సామాన్యమైన వాతావరణంలో గడిపినాడని. యింతవరకు

మనకు యేసు యొక్క విద్య గురించి లభించిన సమాచారాన్నిబట్టి గిట్టని వారెవరో ఆయన విద్యలేని పామరుడు అంటే మనం ఒప్పుకోలేం. ఎందుచేతనంటే, యేసు నజరేతులోని ఆ సమాజ మందిరంలో ధర్మశాస్త్రగ్రంథాన్ని బిగ్గరగా చదవడం గురించిన సంఘటన లూకా ప్రస్తావించాడు కాబట్టి (లూకా 4:16–20).

యేసు శిశువుగావున్నప్పుడు ఐగుప్తుకు స్వల్పకాలం ప్రయాణం తప్ప, ఆయన పాలస్తీనా విడిచి దూర ప్రాంతాలకు వెళ్ళినాడనడానికి మనకు ఎలాంటి ఋజువులు లేవు.[4] అంతే కాదు ఆయన వివాహం చేసుకున్నాడని కాని ఆయనకు పిల్లలున్నారని గాని ఎలాంటి ఆధారాలు లేవు. ఇలాంటి ఊహలు, కథలు, పుకార్లు ఎన్నెన్నో షికారు చేస్తుంటాయి, వాటిని మనం పెడచెవిని పెట్టాలని మనకు కావలసిందల్లా చరిత్రకు సంబంధించిన విషయాలే. కాబట్టి చరిత్రను ఆధారం చేసుకొని సూక్ష్మంగా పరిశోధించినట్టయితే యిలాంటి విషయాలు అసలు జరగలేదని, ఆధారాలు లేవని అర్థమవుతుంది.

సమాజంలో అతి సామాన్యమైన స్థాయిలో జీవిస్తూ, ఎలాంటి విలాసవంతమైన, చివరకు అతి సామాన్యమైన పరిస్థితులు పరిసరాలు, స్థితిగతులు లేకుండ జీవితాన్ని వెళ్ళబుచ్చి, తన దేశాన్ని ఒక వ్యక్తి ఈ రోజున ప్రపంచాన్నంతా ఆకర్షించగల్గుచున్నాడంటే మనందరికెంత ఆశ్చర్యం కలుగుతుందో కదా! యేసు పాలస్తీనాలోనే జీవించాడు. పాలస్తీనాలోనే మరణించాడు. అది అప్పటి రోమా సామ్రాజ్య పరిపాలనా సమయం. ఆయన యూదా సమాజంలో ఒక పల్లెటూరి వ్యక్తిగా జీవించాడు (మరియు ఆయన ఒక సామాన్య సగటు వ్యక్తిగా మాత్రమే ఉండగల్గినాడు) ముప్పది మూడు సంవత్సరాల ప్రాయంలో ఆయన సిలువ వేయబడుట ద్వారా మరణించాడు. ఆయన ఎంతో దీర్ఘకాలం జీవించిన జీవితం కాదు కాని అది ఎంతో అర్థవంతమైన అద్భుత జీవితమది! ఎంత అద్భుతం ఎంత ఆశ్చర్యమైనది? మనం ఈనాటికి ఆయనను గురించి సంభాషించుకొంటున్న జీవితం అది!

---

సూచనలు

[1]మిగతా నలుగురు హేరోదు అంతిపాస్ (మత్తయి 14:1), యితడు బాప్తిస్మమిచ్చు యోహానును శిరశ్ఛేదనం చేసిన వ్యక్తి; అంతిపాస్ తన తమ్ముడు ఫిలిప్పి భార్యను వివాహమాడి నాడు; అదే యోహాను యొక్క శిరశ్ఛేదానికి దారితీసింది (మార్కు 6:17); హేరోదు అగ్రిప్ప I (అపొస్తులుల కార్యములు 12), అపొస్తులుడైన యాకోబును హతమార్చినాడు; మరియు హేరోదు అగ్రిప్ప II (అపొస్తులుల కార్యములు 26), యితడు పౌలు తన్ను తాను యూదుడను అని వాదించుట విన్న వ్యక్తి. [2]సహాయపడే పాఠాలు, చర్చలు Tim Dowley, *The Kregel Bible Atlas* (Grand Rapids, Mich.: Kregel Publications, 2002) లో కనిపిస్తాయి. [3]Koine, లేక సామాన్యమైన "common," యేసు దినాల్లో గ్రీకు భాషను అంతటా మాట్లడేవారు, కాని అది సాంప్రదాయకమైన భాషాలాంటిదికాదు, "సెఫారిస్" అనే ప్రాంతంలో గ్రీకు భాషా ప్రభావం అంతగా లేదు క్రి.శ. 70కి ముందు అంతగా ఉచ్చారణ చేసేవారు కాదు. ఆ తర్వాత దీన్ని ప్రధాన్యతగా వాడినారు" అంటూ Craig A. Evansగారు వ్యాఖ్యానిస్తున్నారు. అయినప్పటికి గలిలయలోవున్న ఎంతోమంది యూదులు గ్రీకు భాషను మాట్లాడినారని అతను ఒప్పుకుంటున్నాడు. (Craig A. Evans, *Fabricating Jesus: How Modern Scholars Distort the Gospels* [Downers Grove, Ill.: InterVarsity Press, 2006], 113-22.) [4]దృరదుష్టవాశాత్తు, యిది యేసు యొద్దకు అనేకులు ప్రయాణమై వచ్చుటకు ఆటంక పర్చలేదు. William W. Mountcastle, *The Secret Ministry of Jesus: Poineer Prophet of Interfaith Dialogue* (New York: University Press of America, 2007), భారత దేశం, టిబేట్, మరియు చైనా దేశాలలో యేసు రహస్య పరిచర్యనుకొనసాగించాడని చారిత్రిక ఆధారాలను బట్టి చెప్పుకొంటుంది.